క్లుప్తంగా

బీడీ కార్మికులకు జీవనభృతి ఇవ్వాలి



మాట్లాడుతున్న సూర్య శివాజీ

నిర్మల్‌టౌన్: బీడీ కార్మికులు, ప్యాకర్లు, టేకేదార్లకు రాష్ట్ర ప్రభుత్వం జీవన భృతి వెంటనే అమలు చేయాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్య శివాజీ డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని భగత్‌సింగ్ భవన్‌లో శనివారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో వ్యవసాయం తర్వాత అత్యధికంగా ఉపాధినిస్తున్న రంగం బీడీ పరిశ్రమనేనని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన చట్టం, జీఎస్టీలు బీడీ పరిశ్రమను దెబ్బతీశాయని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికులందరికీ జీవనభృతిని ఇచ్చి ఆదుకోవాలని కోరారు. నాయకులు ఎం.హరిత, సునారికారి రాజేష్, విలాస్, లింగన్న, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి



పరిసరాలు పరిశీలిస్తున్న డీఎల్‌పీవో రమేశ్

దస్తురాబాద్: మండలంలోని గోడిసీర్యాల గోండుగూడను డీఎల్‌పీవో రమేశ్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 26న గోండుగూడకు ట్రెయినీ కలెక్టర్లు వస్తున్న దృష్ట్యా గ్రామంలో పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టాలన్నారు. వైకుంఠధామం, డంపింగ్ యార్డులో తడి,పొడి చెత్తను వేరు చేసి ఉంచాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో గోబర్‌గ్యాస్ ప్లాంట్ పరిశీలించి పనులు ముమ్మరంగా చేపట్టాలన్నారు. ఎంపీడీవో విజయ్ భాస్కర్‌రెడ్డి, ఎంపీవో అనిల్, పంచాయతీ కార్యదర్శులు రామకృష్ణ, దేవేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీ



పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

భైంసా: బాసర మండలంలోని టాక్లి గ్రామంలో 18 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి శనివారం ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులందరికీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేయూతనిస్తోందన్నారు. ఆర్డీవో కోమల్‌రెడ్డి, సర్పంచ్ శోభాతాయి సాయినాథ్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

అర్హులందరికీ 'దళితబంధు' ఇవ్వాలి

కుంటాల: అర్హులందరికీ దళితబంధు ఇవ్వాలని వెంకూర్ గ్రామానికి చెందిన లబ్ధిదారులు కోరారు. మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ దత్తాద్రిని శనివారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని కోరారు.

భైంసారూరల్: అర్హులందరికీ దళితబంధు ఇవ్వాలని మండలంలోని తిమ్మాపూర్ గ్రామ దళిత సంఘం యువకులు కోరారు. శనివారం భైంసాకు విచ్చేసి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని సమర్పించారు.

పిల్లలను పాఠశాలకు పంపించాలి

తానూరు: మండలంలోని ఎల్వి జెడ్పీ పాఠశాలలో శనివారం పోషకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం భూమన్నయాదవ్ మాట్లాడుతూ విద్యార్థులను పాఠశాలకు పంపించాలన్నారు. విద్యార్థుల హాజరుశాతం వివరాలను పోషకులకు వివరించారు. పాఠశాల చైర్మన్ కృష్ణ, ఉపాధ్యాయులు మాధవ్‌రావ్, సుదర్శన్, రమేశ్, గంగారాణి, కల్పన ఉన్నారు.

కుంటాల: పాఠశాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమవంతుగా కృషి చేయాలని హెచ్‌ఎం ఎల్లన్న పేర్కొన్నారు. మండలంలోని పెంచికల్‌పాడ్ ప్రాథమిక పాఠశాలలో శనివారం నిర్వహించిన పోషకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలలో మెరుగైన ఫలితాలకు కృషి చేస్తామన్నారు. ఎస్‌ఎంసీ చైర్మన్ బాబారావు పాల్గొన్నారు.

మామడ: మండలంలోని అన్ని పాఠశాలలలో శనివారం పోషకుల సమావేశాలు నిర్వహించారు. పాఠశాలల్లో వసతులు, విద్యార్థులు చదవడం, రాయడంలో ప్రదర్శించిన సామర్థ్యాలను ఉపాధ్యాయులు పోషకులకు వివరించారు. విద్యార్థులు పూర్తిస్థాయిలో హాజరయ్యేలా తల్లిదండ్రులు చూడాలని సూచించారు.

సేవతో సెలబ్రేషన్స్

- పుట్టినరోజు, పెళ్లిరోజు పేదల మధ్య జరుపుకుంటూ..
- పేదలు, అనాథలకు చిరు సాయం అందిస్తూ..
- సేవా కార్యక్రమాలతో ఆదర్శంగా నిలుస్తున్న యువత

సండే స్పెషల్



భార్య స్వాతంత్ర పుట్టినరోజు సందర్భంగా పేదలకు ఆహారం అందిస్తున్న రాకేశ్



వివేకానంద ఆవాసంలో పండ్లు అందిస్తున్న నరేశ్



పుట్టినరోజు సందర్భంగా ఏరియాస్పత్రిలో బ్రెడ్ పండ్లు అందిస్తున్న యనుపోతుల సాయి

భైంసాటౌన్: అవును.. మారుతోంది నా యువత..! పుట్టినరోజు, పెళ్లిరోజు, పోయినవారి వర్ధంతిని.. ఇలా ఏ రోజైనా ఆడంబరాలకు పోకుండా, అనవసర ఖర్చులు చేయకుండా పేదలు, అనాథల మధ్య జరుపుకోవడం నిజంగా ఓ మార్పు. వేడుకల సందర్భంగా వృథా ఖర్చులకు పోకుండా అన్నార్థులకు ఆహారం అందించడం, తమకు తోచినవిధంగా సహాయం చేయడం మార్పు. యువత అంటే జులాయిగా తిరుగుతూ, రోడ్లపై కేక్‌లు కట్ చేస్తూ విచ్చలవిడిగా వ్యవహరించడం నుంచి సేవాభావంతో అన్నార్థులను ఆదుకోవాలనే ఆలోచన రావడం వరకు ఓ మార్పు. అవును.. నిజంగా మార్పు కనిపిస్తోంది. భైంసా పట్టణానికి చెందిన ఎంతోమంది యువత సేవాభారతి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ తమ పుట్టినరోజు, పెళ్లిరోజు, ఇతర సందర్భాల్లో నలుగురికి సహాయ పడుతూ సేవానిరతి చాటుతున్నారు.

పేదల ఆకలి తీరుస్తున్న సేవాభారతి..

పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాల సందర్భంగా విపరీతంగా ఆహారం వృథా చేస్తుంటారు. చాలావరకు ఆహార పదార్థాలు మిగిలిపోతుంటాయి. ఇలా మిగిలిన ఆహార పదార్థాలను వృథా చేయకుండా సేవాభారతి భైంసా ఆధ్వర్యంలో పేదలకు, అనాథలకు, భిక్షకులకు అందిస్తున్నారు. ఎక్కడైనా శుభకార్యాల్లో మిగిలిన ఆహార పదార్థాలు ఉంటే వీరికి సమాచారమిస్తారు. వెంటనే సేవాభారతి సభ్యులు మిగిలిన ఆహారాన్ని పేదలకు పంచుతూ వారి ఆకలి తీరుస్తున్నారు.

మచ్చుకు కొన్ని..

- భైంసాలోని గణేశ్‌నగర్‌కు చెందిన యనుపోతుల సాయి స్థానికంగా ఓ చార్టర్డ్ అకౌంటెంట్ వద్ద పని చేస్తున్నాడు. చేస్తున్నది చిన్న ఉద్యోగమే అయినా, తన పుట్టినరోజు సందర్భంగా భైంసాలోని ఏరియాస్పత్రిలో బ్రెడ్, పండ్లు పంపిణీ చేశాడు.
- భైంసాకు చెందిన రాకేశ్ స్థానికంగా ఇంటర్నెట్ కేఫ్ నిర్వహిస్తున్నాడు. తన భార్య పురంశెట్టి స్వాతంత్ర పుట్టిన రోజు పురస్కరించుకుని భైంసా ఏరియాస్పత్రిలో రోగులతోపాటు వీధుల్లో అనాథలకు ఆహారం అందించి ఉదారత చాటుకున్నారు.
- బోయిగల్లికి చెందిన నరేశ్ భైంసాలోని ఏరియాస్పత్రిలో ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన పని చేస్తున్నాడు. తన కాబోయే భార్య గంగసాగర పుట్టినరోజును భైంసాలోని అనాథ పిల్లల ఆశ్రమం వివేకానంద ఆవాసంలో విద్యార్థుల మధ్య జరిపించాడు. ఈ సందర్భంగా అనాథ పిల్లలకు నిత్యావసరాలు, పండ్లు పంపిణీ చేశారు.
- భైంసా మండలం వాలేగాం గ్రామానికి చెందిన ఘల్లుడే విఠల్ తన కుమారుడు పుట్టిన రోజు సందర్భంగా భైంసాలోని పేదలకు అన్నదానం చేశారు. పూరిగుడిసెల్లో ఉండే పేదలతోపాటు రోడ్ల వెంబడి ఉండే అనాథలకు ఆహారం అందించారు.

'సహకారం'తో సమాజాభివృద్ధి

- సహకారశాఖాధికారి శ్రీనివాస్‌రెడ్డి
- లోకమాన్య సహకార సంఘం ప్రారంభం



డీసీఓను సన్మానిస్తున్న లోకమాన్య సంఘ సభ్యులు

నిర్మల్: భవిష్యత్తులో సహకార సంఘాలు వేగంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందని, పరస్పర సహకారం వల్ల సమాజాభివృద్ధి జరుగుతుందని జిల్లా సహకారశాఖాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని శివాజీచౌక్ భైంసారోడ్డులో లోకమాన్య పరస్పర సహకార, పొదుపు, పరపతి సంఘాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘాల ద్వారా సామాజిక, సేవాకార్యక్రమాలు చేపట్టడానికి వీలవుతుందన్నారు. కార్యక్రమంలో సంఘ వ్యవస్థాపకుడు భూసారపు గంగాధర్, బాధ్యులు నూకల విజయ్ కుమార్, నార్లపురం రవీందర్, మంచిరాల నాగభూషణం, షోలాపూర్ రాజేశ్వర్, ఆడెపు సుధాకర్, మైసర్ల శంకర్, అడహక్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం



నిర్మల్‌ఖిల్లా: డాగురే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నిర్మల్‌ఖిల్లా: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని జిల్లాకేంద్రంలో శనివారం ఘనంగా నిర్వహించారు. నిర్మల్ ప్రొఫెషనల్ ఫొటో వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నిర్మల్ ప్రొఫెషనల్ ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సగ్గం వంశీశ్వర్, ఉపాధ్యక్షులు తౌట్ హరీన్, ప్రధాన కార్యదర్శి పోలకొండ గోపివర్మ, కోశాధికారి సోయిని శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు రమేశ్, కిశోర్, వినయ్ గంగాధర్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్: పట్టణంలో ఫొటోగ్రఫీ మండల యూనియన్ సభ్యులు శనివారం లూయిస్ డాగురే చిత్రపటానికి పూలమాల వేశారు. కాశీనాథ్, కృష్ణస్వామి, మల్లేశ్, నవీన్, నర్సయ్య, సాయి, వరుణ్, రాకేశ్, రాజేష్, సతీశ్, ఎల్లయ్య, ఫణీందర్ తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ 'గృహలక్ష్మి'

లోకేశ్వరం: అర్హులందరికీ గృహలక్ష్మి పథకం వర్తింపజేస్తామని ఎంపీడీవో సోలమాన్ రాజ్ అన్నారు. మండలంలోని గొడిసెరా గ్రామంలో గృహలక్ష్మికి దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్లకు వెళ్లారు. దరఖాస్తులను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని 25 పంచాయతీల్లో 2297 మంది గృహలక్ష్మికి దరఖాస్తులు వచ్చాయని అన్నారు. కార్యదర్శి గంగాధర్ ఉన్నారు.

గృహలక్ష్మి దరఖాస్తుల పరిశీలన

లక్ష్మణచాంద: మండలంలోని కనకాపూర్‌లో గృహలక్ష్మి దరఖాస్తుల పరిశీలన కొనసాగుతోంది. గ్రామంలో ఎంపీవో నసీరుద్దీన్ శనివారం పర్యటించి దరఖాస్తుల చేసుకున్నవారి ఇళ్లకు వెళ్లి దరఖాస్తులను పరిశీలించారు.

ఘనంగా అన్నాభావు సాఠే జయంతి



సాఠే విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్ గ్రామంలో అన్నాభావు సాఠే జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నాభావు సాఠే అడుగుజాడల్లో నడవాలన్నారు. ఎంపీపీ కల్పనజాదవ్, నాయకులు శ్రీనివాస్, ఉత్తంబాలేరావు, ఈశ్వర్, గంగాధర్, గణపతి, శంకర్, సాయినాథ్, పాపన్న తదితరులు ఉన్నారు.

ముథోల్: మండలంలోని తరోడా గ్రామంలో అన్నాభావుసాఠే జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు జెండా ఆవిష్కరించి, అన్నాభావుసాఠే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు లక్ష్మణ్‌యాదవ్, నందు, దత్తు, బుద్దాజి, ప్రభుదాస్ తదితరులు ఉన్నారు.



పొలాల్లో వరద నీరు..

లోకేశ్వరం: అన్ని గ్రామాల్లో మోస్తరు భారీ వర్షం కురిసింది. మండలంలో 60 మి.మీ వర్షపాతం నమోదైందని తహసీల్దార్ మోతీరాం తెలిపారు. శుక్ర, శనివారాల్లో ఎడతెరిపి లేకుండా వాన కురవడంతో వ్యవసాయ పనులు సాగలేవు. పంచగుడి సమీపంలోని వంతెన వద్ద గోదావరి నిండుగా పారుతోంది. ధర్మోర పెద్ద చెరువు పూర్తిగా నిండిపొయి అలుగు నుంచి వరద నీరు గోదావరిలోకి చేరుతోంది. వర్షపు నీరు పొలాల్లో నుంచి పారడంతో పెద్ద పెద్ద గండ్లు ఏర్పడ్డాయని రైతులు తెలిపారు. చెరువుల్లో, కుంటల్లో నీరు రావడంతో ఆనందం వ్యక్తం చేశారు.

నేటి నుంచి వేంకటేశ్వర బ్రహ్మోత్సవాలు



మామడ: మండలంలోని కొరిటికల్ గ్రామంలో ఆదివారం నుంచి వేంకటేశ్వరాలయంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. అంకురార్పణ, తీర్థప్రసాద గోష్టి, పారాయణం, కల్యాణం, రథోత్సవం, అన్నదానం, తెప్పోత్సవం, హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

22న మండల సర్వసభ్య సమావేశం

నిర్మల్‌రూరల్: నిర్మల్ రూరల్ మండల సర్వసభ సమావేశం ఈనెల 22న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సాయిరాం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, కోఆప్షన్ మెంబర్లు, అధికారులు హాజరుకావాలని కోరారు.

డీసీసీబీ వైస్ చైర్మన్ జన్మదిన వేడుకలు



కేక్ కటింగ్‌లో పాల్గొన్న పీఏసీఎస్ సిబ్బంది

లక్ష్మణచాంద: డీసీసీబీ వైస్ చైర్మన్ ఎర్ర రఘునందన్ రెడ్డి జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ అడ్వాల పద్మ, జెడ్పీటీసీ రాజేశ్వర్, గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ నాయకులు, పీఏసీఎస్ కార్యాలయ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో కేక్ కట్ చేయించారు. పలువురు ఆయన్ను సన్మానించారు. ఆయన అభిమానులు 40 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల ఇన్‌చార్జి అల్లోల సురేందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు క్రిష్టారెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ సంగెం వెంకటరాజు, నాయకులు అట్ల సురేష్‌రెడ్డి, పీఏసీఎస్ సీఈవో ఉదయ్, ఏసీఈవో శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది సుధాకర్, డిన్నూ పాల్గొన్నారు.

భైంసా, కుంటాలలో వర్షం



టీటీడీ కల్యాణ మండపానికి వెళ్లే దారిలో వర్షపునీరు



కుంటాల పశువైద్యశాల ఎదుట నిలిచిన నీరు

భైంసా: పట్టణంలో కురుస్తున్న వర్షాలకు ప్రధాన రోడ్లపై నీరుచేరుతుంది. గడ్డెన్నవాగు ప్రాజెక్టు సమీపంలోని టీటీడీ కల్యాణ మండపానికి వెళ్లే రోడ్డు శనివారం పూర్తిగా నీటమునిగింది. పక్కనే ఉన్న కాలనీలోకి వర్షపునీరు వస్తుంది. రాహుల్‌నగర్‌లో వర్షపు నీరు కనిపించింది.

కుంటాల: గ్రామాల్లో చిరుజల్లులతో కూడిన వర్షం కురిసింది. వ్యవసాయ పనులు కొనసాగలేదు. కుంటాల పశువైద్యశాల, గ్రంథాలయం ఎదుట వర్షపు నీరు నిలవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. 67.4 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఏఎస్‌వో సాయన్న తెలిపారు.

నేడు దంత వైద్యశిబిరం

కడెం: మండలంలోని కొండుకూర్‌కు చెందిన కొల్లూరి శ్రీనివాస్, చంద్రహాస్ ఆధ్వర్యంలో అల్లంపల్లి జీయర్ గురుకులంలో ఆదివారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఆదిలాబాద్ డెంటల్ అసోసియేషన్‌కు చెందిన వైద్యులు హాజరై రోగులకు పరీక్షించనున్నారు.

కాంగ్రెస్ అధికారమే లక్ష్యంగా పని చేయాలి



నూతన యూత్ కాంగ్రెస్ అధ్యక్షులతో నాయకులు

కడెం: వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారమే లక్ష్యంగా యూత్ కాంగ్రెస్ శ్రేణులు పనిచేయాలని ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ కొమ్ము విజయ్ పిలుపునిచ్చారు. మండలంలోని కొండుకూర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో పార్టీ నియోజవర్గ కాంగ్రెస్ నాయకుడు పొద్దుటూరి సతీశ్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు సమావేశానికి ఆయన హాజరయ్యారు. అనంతరం ఇటీవల నూతనంగా ఎన్నికైన కడెం, దస్తురాబాద్, జన్నారం, ఖానాపూర్, ఉట్నూర్ మండలాల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, ఎన్‌ఎస్‌యూఐ అసెంబ్లీ అధ్యక్షుడు రాకేశ్‌లను సన్మానించారు. ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు తరి శంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రయ్య, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బరుపటి రమేశ్, ఖానాపూర్, జన్నారం, ఇంద్రవెల్లి మండల అధ్యక్షులు నాగోరావు, ముజాఫర్, గంగాధర్, మల్లారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి బండి నితిన్, ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి సోహేల్ పాల్గొన్నారు.

ఆలయాల్లో భక్తుల సందడి



కుంటాల: పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కుంటాల: శ్రావణమాసం తొలి శనివారం పురస్కరించుకుని మండలంలోని సూర్యాపూర్ రాజరాజేశ్వరాలయం, ఓలా శివాలయం, కుంటాల ఉమామహేశ్వర, మహాదేవుని ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. సూర్యాపూర్ రాజరాజేశ్వరాలయంలో సర్పంచ్ బక్కి సునీత భోజన్న ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. వీడీసీ, ఆలయ కమిటీ చైర్మన్లు పోతన్న, రొడ్డ రవి, శివాజీ, ముతన్న, రాజన్న, అశోక్, శేఖర్ పాల్గొన్నారు.

తానూరు: బోరిగాం సమీపంలోని మహాదేవున్ని ఆలయంలో భక్తులు పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. బోరిగాం గ్రామానికి చెందిన శివాజీ పటేల్ భక్తులకు అన్నదానం నిర్వహించారు. సర్పంచులు, భక్తులు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌కు రాజీనామా

కడెం: మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్‌కు చెందిన భుక్యా రమేశ్ యూత్ కాంగ్రెస్ నియోజవర్గ ఉపాధ్యక్ష పదవికి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ మేరకు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనరెడ్డికి శనివారం లేఖ పంపారు. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేసినట్లు తెలిపారు.

అనర్హులను తొలగించాలని ఫిర్యాదు

ఖానాపూర్: పట్టణంలోని డబుల్ బెడ్రూం ఇళ్లలోకి అక్రమంగా వచ్చి చేరిన అనర్హులను తొలగించాలని కోరుతూ బాధితులు జిల్లా కలెక్టర్‌కు శనివారం ఫిర్యాదుచేశారు. కరిపె రాజశేఖర్, బొప్పారపు శ్రీనివాస్, ఇర్ఫాన్, అన్వర్ తదితరులు ఉన్నారు.

సంక్షిప్తంగా..

27న పద్మశాలి ఎన్ఆర్‌ఐ వివాహ పరిచయ వేదిక

ఖానాపూర్: తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 27న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో పద్మశాలి ఎన్ఆర్‌ఐ వివాహ పరిచయ వేదిక నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు బి.ఉమాశంకర్ ఓ ప్రకటనలో కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు సెల్‌నంబర్ 9704360703లో సంప్రదించాలన్నారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

మామడ: రైతులు వ్యవసాయ రుణాలు సద్వినియోగం చేసుకోవాలని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర చీఫ్ మేనేజర్ సునీల్ బానక్ కోరారు. మండలంలోని పొన్కల్ గ్రామంలో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర బ్రాంచ్‌ను శనివారం సందర్శించారు. రైతులు వ్యవసాయ రుణాలను సకాలంలో రెన్యువల్ చేసుకుంటే 7 శాతంలోపు వడ్డీ మాత్రమే ఉంటుందన్నారు. గడువు దాటితే వడ్డీ చెల్లించాలన్నారు. రుణాలు రెన్యువల్ చేసుకుంటే రుణమాఫీ జరిగినా లబ్ధి పొందుతారని అన్నారు. బ్యాంకు మేనేజర్ వెంకటేశ్, సర్పంచ్ భూమేశ్వర్, వినియోగదారులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీకి చెందిన రాజన్న గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పెంబి జెడ్పీటీసీ జానుబాయి అక్కడికి వెళ్లి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాయకులు పవన్, శ్రీనివాస్, వినోద్, రవితేజ తదితరులు ఉన్నారు.

ఘనంగా పాపన్నగౌడ్ జయంతి



విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

ఖానాపూర్: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 373 జయంతిని పట్టణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ గౌడ సంఘం ఆధ్వర్యంలో పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నర్సాగౌడ్, రాజారాం గౌడ్, వెంకాగౌడ్, రాజేందర్ గౌడ్, శంకర్‌గౌడ్, శేఖర్ గౌడ్, మల్లేశ్ గౌడ్, రాజేశ్వర్ గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, భూమాగౌడ్, రమేశ్‌గౌడ్, గజేందర్ గౌడ్, జగన్, గణేశ్, జలందర్ ఉన్నారు.